సాక్షి నంద్యాల

బుధవారం । 29 । జనవరి । 2025



మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై మంగళవారం ధర్మవరానికి చెందిన లలిత నృత్య కళానికేతన్ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



జీడీపీ నుంచి నీటి విడుదల

గోనెగండ్ల: కోడుమూరు పరిధిలో ఎండుతున్న ఎల్లెల్సీ ఆయకట్టు పంటలకు నీరందించేందుకు గాజులదిన్నె ప్రాజెక్ట్ నుంచి రోజుకు 64 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు.

పరివార దేవుళ్లకు పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నగా పేరు పొందిన నందీశ్వరునికి, శైలక్షేత్రపాలకునిగా ప్రసిద్ధి గాంచిన బయలు వీరభద్ర స్వామి వారికి మంగళవారం సందర్భంగా శాస్త్రోక్తంగా అర్చకులు విశేష పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

నమో నారసింహ



ఉత్సవమూర్తులు

రుద్రవరం: పార్వేట ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అహోబిలేశుడి పల్లకీ మండలంలోని ముత్తలూరు గ్రామానికి చేరుకుంది. ఉత్సవ మూర్తులు జ్వాలా నరసింహస్వామి, లక్ష్మీనరసింహస్వాములు ఉత్సవ పల్లకీ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి ఉత్సవ పల్లకీ రాకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

జడ్జి తనిఖీలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సబ్ జైలు, వన్‌స్టాప్ సెంటర్, ప్రత్యేక దత్తత విభాగ కేంద్రాలను మంగళవారం కర్నూలు డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి నీలా వెంకటశేషాద్రి తనిఖీలు చేశారు. స్థానిక పొన్నాపురం వన్ స్టాప్ సెంటర్‌లోని రికార్డులను పరిశీలించి కేసు ల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్పెషలైజ్డ్ అడాప్షన్ సెంటర్‌ను తనిఖీ చేసి పిల్లల ఆరోగ్యంపై ఆరా తీశారు. అదే విధంగా నంద్యాల సబ్ జైల్‌ను తనిఖీ చేసి ఖైదీల వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది హారిక, పరమేశ్వరి, జైలు పారా లీగల్ న్యాయవాది వర్తియా బాలునాయక్ జైలు సూపరింటెండెంట్ గురుప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

కేసీకి నీటి సరఫరా బంద్

జూపాడుబంగ్లా: మల్యాల, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాల నుంచి కేసీ కాల్వకు నీటి పంపింగ్‌ను అధికారులు నిలిపివేశారు. సుంకేసుల డ్యాం నుంచి మాత్రం కేసీకి 2,500 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతుంది. రైతుల వినియోగార్థం ఈ నీటిని నేరుగా తూడిచెర్ల సబ్ చా నల్ కాల్వకు వదులుతున్నారు. నిప్పులవాగు, ఎబీఆర్ కాల్వకు సాగునీటి సరఫరా నిలిపివేసినట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

2 టీఎంసీలకు ఇండెంట్

కేసీకాల్వకు కేటాయించిన నీటిలో ప్రస్తుతం 2 టీఎంసీలు వదలాలని నీటిపారుదలశాఖ అధికారులు తుంగభద్ర డ్యాం అధికారులకు ఇండెంట్ పెట్టారు. దీంతో టీబీ డ్యాం నుంచి సుంకేసులకు 2టీఎంసీల నీరు విడుదల చేశారు. అక్కడి నుంచి రోజుకు 2వేల క్యూసెక్కుల చొప్పున పది రోజులపాటు కేసీ కాల్వకు నీరు సరఫరా చేయనున్నట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు.

ప్రయోగం.. ప్రహసనం



ప్రయోగ పరీక్షలకు హాజరైన విద్యార్థులు(ఫైల్)

- పరికరాలు, రసాయనాలకు నిధులు నిలిపేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ల్యాబ్‌లు ఉన్న చోట బూజు పట్టిన పరికరాలు
- కొన్ని కాలేజీల్లో కాగితాల్లోనే ప్రయోగశాలలు
- థియరీ, పోటీ పరీక్షలకే పరిమితమైన కార్పొరేట్, ప్రైవేటు కాలేజీలు
- విద్యార్థుల నుంచి ప్రాక్టికల్ పరీక్షలకు ఫీజుల వసూలు
- ఇంటర్ బోర్డు అధికారుల తనిఖీల్లో బట్టబయలు
- ఫిబ్రవరి 10 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

నంద్యాల (న్యూటౌన్): విద్యార్థులు పాఠ్యాంశాలను వంద శాతం అర్థం చేసుకోవాలంటే ప్రయోగాలు తప్పనిసరి. ఇందుకు విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ప్రయోగ పరీక్షలు చేయించాలి. అయితే ఇంటర్మీడియెట్‌లో చేరిన సైన్స్, మాథ్స్ విద్యార్థులతో కార్పొరేట్, ప్రైవేటు కాలేజీల్లో ప్రయోగాలు చేయించడం లేదు. థియరీ, పోటీల పరీక్షలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఫిబ్రవరి 10వ తేదీ నుంచి ఇంటర్మీడియెట్ ప్రయోగ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు బోర్డు నుంచి ఆయా కాలేజీలకు చెందిన యాజమాన్యాలకు సమాచారం చేరింది. ఇందులో భాగంగా బోర్డు అధికారులు కాలేజీల్లో ల్యాబ్‌ల పరిస్థితి ఎలా ఉందో తెలుసుకునేందుకు తనిఖీలు చేయగా కార్పొరేట్, సెమీ కార్పొరేట్, ప్రైవేటు కాలేజీల్లో ల్యాబ్‌లు నామమాత్రంగా ఉన్నట్లు తేలింది. చాలా కాలేజీల్లోని ల్యాబ్‌ల్లో రసాయనాలు, స్పెసిమన్లు అలమరాలకే పరిమితం అయినట్లు, ఇతర పరికరాలు బూజు పట్టినట్లు గుర్తించారు. అలాగే విద్యార్థులతో ఎలాంటి ప్రయోగాలు చేయించడం లేదని అధికారులు గుర్తించి ఆయా కాలేజీలకు నోటీసులు జారీ చేశారు.



నన్నూరు దగ్గర ఉన్న నారాయణ కాలేజీలోని ల్యాబ్‌ను తనిఖీ చేస్తున్న ఆర్ఐఓ గురవయ్య శెట్టి

ఇదీ పరిస్థితి..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.. జూనియర్ కళాశాలల్లో ప్రయోగాల నిర్వహణ కోసం ఏడాదికి రూ.30వేల నుంచి రూ.50వేల వరకు నిధులు విడుదల చేసేది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితులు మారాయి. ఈ విద్యాసంవత్సరం నుంచి విద్యార్థి చెల్లిస్తున్న రూ.2 వేల ఫీజుతో పాటు రూ.400 ప్రయోగాల కోసం కేటాయిస్తున్నారు. వసూలు చేసిన మొత్తం ల్యాబ్‌ల్లో పరికరాలు, రసాయనాల కొనుగోలుకు సరిపోకపోవడంతో ఆయా కళాశాలలో అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు. అరకొరగా ప్రయోగాలు చేయించి సరిపెట్టేస్తున్నారు. ఇంటర్‌మీడియెట్ విద్యార్థులకు ఫస్ట్ ఇయర్ నుంచే ప్రయోగాలు చేయించాలి. కానీ కార్పొరేట్, ప్రైవేటు కాలేజీల్లో ఎక్కడ కూడా చేయించడం లేదు. ఈ విషయాన్ని ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు తనిఖీల్లో గుర్తించినా..వారికి ఆయా కాలేజీలపై చర్యలు తీసుకునేందుకు ఎలాంటి అధికారం లేకుండా బోర్డు ఉన్నతాధికారులు చేశారనే విమర్శలు ఉన్నాయి. ఈ కాలేజీల్లో ప్రయోగ పీరియడ్లు లేకుండా కేవలం థియరీ, జేఈఈ, నీట్ వంటి పోటీల పరీక్షల తరగతులను నిర్వహిస్తున్నారు. ప్రయోగ పరీక్షలకు దగ్గర పడుతున్న సమయంలో హడావుడిగా విద్యార్థులను ల్యాబ్‌లకు తీసుకొని వెళ్తున్నారని విమర్శలున్నాయి.

'కార్పొరేట్' యాజమాన్యాలు ఇష్టారాజ్యం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యను అకడమిక్ క్యాలెండర్ ప్రకారం నిర్వహించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అకడమిక్ క్యాలెండర్‌ను పట్టించుకోవడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.. ప్రయోగ పరీక్షలను జంబ్లింగ్ విధానంలో నిర్వహించి ఎలాంటి అవతవకలకు అస్కారం లేకుండా చేసింది. అయితే కార్పొరేట్ కాలేజీల యాజమాన్యాలు కాసులతో ప్రస్తుత ప్రభుత్వం నాన్ జంబ్లింగ్ విధానంలో పరీక్షలు నిర్వహించేటట్లు చేసినట్లు విమర్శలున్నాయి. ఫిబ్రవరిలో మొదలు కానున్న ప్రయోగ పరీక్షలను ఏ కాలేజీకి చెందిన విద్యార్థులు ఆ కాలేజీలోనే రాయనున్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల వివరాలు..

- కర్నూలు జిల్లాలో అన్ని యాజమాన్యాలకు చెందిన కాలేజీలు 161 ఉన్నాయి. ఇందులో 81 కార్పొరేట్, ప్రైవేటు కాలేజీలు ఉన్నాయి. ప్రయోగ పరీక్షలు వచ్చే నెల 10 నుంచి 20వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ పరీక్షలకు సుమారుగా 19,366 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలుస్తోంది. వొకేషనల్ విద్యార్థులకు వచ్చే నెల 5 నుంచి 20వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగనున్నాయి.
- నంద్యాల జిల్లాలో 162 ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ సెకండియర్ 13,040 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఫిబ్రవరి 10న జరిగే ప్రయోగ పరీక్షలకు ఎంపీసీ 5,393 మంది, బైపీసీ 3,174 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఒకేషనల్ కోర్సుల్లో విద్యాభ్యాసం చేసే 2,410 మంది విద్యార్థులు ప్రయోగ పరీక్షలకు హాజరు కానున్నారు.

నోటీసులు జారీ చేశాం

కర్నూలు జిల్లాలోని కాలేజీల్లో ల్యాబ్‌లు తనిఖీలు చేశాం. కొన్ని కాలేజీల్లో ప్రయోగ పరీక్షలు నిర్వహించడం లేదని గుర్తించాం. 15 కాలేజీలకుపైగా నోటీసులు కూడా ఇచ్చాం. ప్రయోగాలు చేయించాలని ఎన్నోసార్లు ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లను హెచ్చరించాం. ఆ తరువాత కొంత మంది చేయిస్తున్నారు. మరి కొంత మందిలో ఏ మాత్రం మార్పులు రావడం లేదు. పరీక్షల షెడ్యూల్ అధికారికంగా రావాల్సి ఉంది.

– గురవయ్య శెట్టి, ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి

మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి



కళాశాలల్లో పరీక్షలకు సంబంధించి మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నాం. విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు నిరంతర పర్యవేక్షణ చేస్తున్నాం. అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం ప్రయోగ పీరియడ్లు నిర్వహించేలా చర్యలు తీసుకున్నాం.

– సునీత, ఇంటర్ నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారిణి, నంద్యాల

ఎంపీ అనుచరుల హల్‌చల్

- జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు కురుమూర్తిపై దాడి
- నడిరోడ్డుపై పిడి గుద్దులు గుద్దుతూ లాక్కెళ్లిన వైనం
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన దాడి సంఘటన



కురుమూర్తిని లాక్కెళ్తున్న ఎంపీ వర్గీయులు

నందికొట్కూరు: ఎంపీ బైరెడ్డి శబరి అనుచరులు హల్‌చల్ చేశారు. పట్టపగలే నడిరోడ్డుపై నంద్యాల జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కురుమూర్తిపై దాడి చేశారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటన వివరాల్లోకి వెళితే.. అల్లూరు గ్రామానికి చెందిన కుమ్మరి వెంకటస్వామి, శేషన్న అన్నదమ్ములు. ఎంపీ శబరి అనుచరులైన వీరు నందికొట్కూరు పట్టణానికి చెందిన బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కురుమూర్తిపై సోమవారం దౌర్జన్యంగా దాడికి దిగారు. బీసీ సంఘం నాయకుడు అని కూడా చూడకుండా ప్రధాన రహదారిపైనే అతడిని పిడి గుద్దులు గుద్దుతూ చొక్కా పట్టుకొని కొద్ది దూరం లాక్కెళ్లారు. తర్వాత వారు పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఈ దాడి ఘటనపై విచారణ చేసి కురుమూర్తిపై దాడికి పాల్పడిన కుమ్మరి వెంకటస్వామి, శేషన్నపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కాగా కురుమూర్తి, ఎంపీ అనుచరుల మధ్య భూ సంబంధ పంచాయితీ నడుస్తున్నట్లు సమాచారం.

ఉమ్మడి జిల్లాకు 4,54,924 పింఛన్లు

కర్నూలు(అగ్రికల్చర్): ఎన్‌టీఆర్ పెన్షన్ కానుక కింద ఫిబ్రవరి నెలకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో 4,54,924 పింఛన్లకు రూ.194 కోట్లు మంజూరు అయ్యాయి. జనవరి నెలతో పోలిస్తే ఫిబ్రవరి నెలలో 1005 పింఛన్లపై కోత పడింది. చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత నెలనెల గుట్టచప్పుడు కాకుండా పింఛన్‌లలో కోత విధిస్తున్న విషయం తెలిసిందే. నంద్యాల జిల్లాలో జనవరి నెలలో పింఛన్ల సంఖ్య 2,16,111కి ఉండగా.. ఫిబ్రవరి నెలలో పింఛన్ల సంఖ్య 2,15,592 తగ్గింది. వీటికి సంబంధించి రూ.91 కోట్లు మంజూరు అయ్యాయి.

వందశాతం ఫలితాలు సాధించాలి

- అధికారులతో 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్



మాట్లాడుతున్న చైర్మన్ లంకా దినకర్

నంద్యాల: స్వర్ణాంధ్ర –2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్య సాధనకు కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టులను పకడ్బందీగా అమలు చేసి వంద శాతం ఫలితాల సాధించాలని 20 సూత్రాల ఫార్ములా కమిటీ చైర్మన్ లంకా దినకర్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో 20 సూత్రాల కార్యక్రమాల అమలుపై వివిధ శాఖల జిల్లా అధికారులతో చైర్మన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి, సీపీఓ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. 20 సూత్రాల కమిటీ చైర్మన్ మాట్లాడుతూ కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుపై జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఉపాధి హామీ పథకం నిధులు మురిగిపోకుండా ప్రణాళికబద్ధంగా ఖర్చు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రసిద్ధ దేవాలయాలను పర్యాటక రంగానికి అనుసంధానం చేసి టెంపుల్ టూరిజంగా అభివృద్ధి చేయాలన్నారు. జిల్లాలోని నల్లమల్ల అడవులలో వైల్డ్ లైఫ్ సెంచురీ, జంగిల్ సఫారీ కి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. కలెక్టర్ జి.రాజకుమారి జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ కొలిమిగుండ్ల మండలంలో పనులు లేక కూలీలు వలస వెళుతున్నారని ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ కొత్తపల్లి మండలంలో సిద్ధేశ్వరం వద్ద కృష్ణా నదిపై తీగల వంతెన బదులు బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మాణం చేపట్టాలని కోరారు. బ్యారేజ్ నిర్మిస్తే సంగమేశ్వరం వద్ద కృష్ణా నదిలో సుమారు 60 టీఎంసీల నీరు నిలువ ఉంచుకోవచ్చని దీంతో నంద్యాల జిల్లాతో పాటు రాయలసీమ ప్రాజెక్టులకు సాగు, తాగునీరు అందుతుందన్నారు. సమావేశంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దూకేస్తాం... కొలువులు పట్టేస్తాం



లాంగ్‌జంప్‌లో పోటీ పడుతున్న మహిళ

కర్నూలు: ప్రజల ప్రాణాలు, ఆస్తిపాస్తులు, హక్కులు, గౌరవ మర్యాదలు కాపాడటంలో పోలీసుల పాత్ర ఎనలేనిది. తలపై టోపీ, ఒంటిపై ఖాకీ, చేతిలో లాఠీ ధరించి విధులు నిర్వర్తించాలనేది పలువురి కల. అటువంటి ఆకాంక్షను సాకారం చేసుకోవడానికి పోలీసు అభ్యర్థులు వేకువజామునే మైదానానికి తరలివచ్చారు. పోలీసు శాఖలో కానిస్టేబుల్ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియకు హాజరయ్యారు. మంగళవారం ఏపీఎస్పీ మైదానంలో ఉదయం 5 గంటల నుంచి రాత్రి పొద్దుపోయేదాకా నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షల్లో పాల్గొని పలువురు సత్తా చాటారు. పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలు అర్హత సాధించిన అభ్యర్థులకు 17వ రోజు దేహదారుఢ్య పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఇన్‌చార్జి ఎస్పీ ఆదిరాజ్‌సింగ్ రాణా పోటీలను పర్యవేక్షించారు. 569 మంది పురుష, మహిళా అభ్యర్థులు బయోమెట్రిక్‌కు హాజరయ్యారు. వారి సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్టులు నిర్వహించారు. అందులో ఉత్తీర్ణులైన వారందరికీ ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టులు 1600 మీటర్లు, 100 మీటర్ల పరుగు లాంగ్‌జంప్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో 268 మంది అభ్యర్థులు తమ ప్రతిభను చాటి తుది రాత పరీక్షకు అర్హత సాధించారు.

మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోండి

డోన్ రూరల్ : గీత కులాలు, ఉప కులాల వారు మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాముడు తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ వరలక్ష్మి తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో గీత కులాలు, ఉప కులాల మొత్తం 11 మద్యం షాపులు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో ఈడిగ-7, గౌడ్-3, గౌడ-1 ఉన్నాయన్నారు. ఆసక్తి గల వారు ధరవత్తు రూ. 2 లక్షలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఫిబ్రవరి-5వ తేదీ సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు. కాగా జిల్లాలో తొలి రోజు మంగళవారం ఒక్క దరఖాస్తు కూడా రాలేదని తెలిపారు.

ఉలిక్కిపడిన చాపిరేవుల



పేలుడు ధాటికి కూలిన ఇంటి పైకప్పు, గోడలు

- గ్యాస్ ప్రమాద ఘటనలో అవ్వ, మనవడి మృతితో విషాదం
- కలిచివేసిన బాధితుల ఆర్తనాదాలు



ప్రమాదం జరిగిన ఇల్లు

నంద్యాల(అర్బన్): ఒక్కసారిగా భారీ శబ్దం. ఏదో ప్రమాదం సంభవించిందని తెలుసుకునే లోపే రోదనలు మిన్నంటాయి. చావు కేక చాపిరేవులను నిద్రలేపింది. గ్యాస్ లీకై ఇద్దరు మృతి చెందగా ఆరుగురు గాయపడ్డారు. ఈ సంఘటన గ్రామస్తులను ఉలిక్కిపాటుకు గురి చేసింది. మంగళవారం తెల్లవారుజామున దాదాపు 4.15 గంటల సమయంలో అందరూ నిద్ర మత్తులో ఉన్నారు. ఒక్కసారిగా భారీ శబ్దం వినిపించడంతో ప్రజలు భయాందోళన చెందారు. గ్రామానికి చెందిన వృద్ధురాలు వెంకటసుబ్బమ్మ(60), ఆమె మనవడు దినేష్(10) గ్యాస్ సిలిండర్ లీకై ఇంటి పైకప్పు కూలిన ఘటనలో మృత్యువాత పడ్డారు. ఈ విషయం గ్రామంలో దావణంలా వ్యాపించడంతో ఒక్కసారిగా గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు.

ప్రమాదాన్ని ముందే పసిగట్టినా..

గ్రామానికి చెందిన భీమవరపు నాగపుల్లయ్య (లేట్), వెంకటసుబ్బమ్మకు ముగ్గురు సంతానం. లింగమయ్య మొదటి సంతానం కాగా సుబ్బరాయుడు రెండవ సంతానం, లింగమ్మలు మూడవ సంతానం. ముగ్గురికి వివాహాలు జరిగాయి. గత ఆరేళ్ల క్రితం నాగపుల్లయ్య అనారోగ్యంతో మృతి చెందారు. లింగమయ్య, సుబ్బరాయుడు ఇరువురు స్థానిక సచివాలయ సమీపంలోని ఫరూక్ నగర్‌లో మూడు సెంట్ల స్థలంలో ఒక ఇంటిని రెండు భాగాలుగా విభజించుకుని నివాసముంటున్నారు. ఆ పక్కనే ఖాళీ స్థలంలో వృద్ధురాలు వెంకటసుబ్బమ్మకు షెడ్ మాదిరి వేశారు. అందరూ వ్యవసాయ కూలీ పనులకు వెళ్తూ జీవిస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున లింగమయ్య భార్య వెంకటేశ్వరి నిద్ర లేచింది. ఆ సమయంలో భర్త లింగమయ్య ఏదో వాసన వస్తుందని పసిగట్టాడు. భార్యకు విషయం చెప్పేలోపే ఆమె ఇంట్లో విద్యుత్ బల్బు స్విచ్ ఆన్ చేసింది. అప్పటికే గ్యాసంతా ఇంటిని చుట్టేయడంతో భారీ పేలుడు సంభవించింది. ఇంటి గోడలు ఎగిరి చెల్లా చెదురయ్యాయి. వెంకటేశ్వరిని మంటలు చుట్టుముట్టడంతో భర్త లింగమయ్య ఒక్కసారిగా ఆమెను కాపాడేందుకు పరిగెత్తాడు. ఇరువురు మంటల్లో చిక్కుకున్నారు. వారి కొడుకులను మెయిన్ గేటు మీదుగా గెంటి వేయడంతో బయట పడ్డారు. ప్రస్తుతం లింగమయ్య, వెంకటేశ్వరిల పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు కర్నూలు ఆసుపత్రికి రెఫర్ చేశారు.

శిథిలాల కింద మృతదేహాలు

గ్యాస్ పేలుడికి ఇంటి పైకప్పు ఒక్కసారిగా కుప్పకూలింది. ఆ సమయంలో ఇంటి గోడలు ధ్వంసమయ్యాయి. కాగా ఇంటి ఆవరణలో నిద్రిస్తున్న వెంకటసుబ్బమ్మ, రెండవ కుమారుడు సుబ్బరాయుడు కొడుకు దినేష్‌పై సిమెంట్ దిమ్మెల పడి అక్కడికక్కడే మృతి చెందారు. దినేష్ 5వ తరగతి చదువుతున్నాడు. మృతి చెందిన వారిని సిమెంట్ దిమ్మెల కింది నుంచి బయటకు తీసేందుకు అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు చాలా ప్రయత్నించాల్సి వచ్చింది. వెంకటసుబ్బయ్య ఇంట్లో నిద్రిస్తున్న భార్య రామలక్ష్మమ్మ, చెల్లెలు లింగమ్మతో పాటు కొడుకు సుశాంత్‌లు గాయాలపాయ్యారు. గ్యాస్ పేలిన సంఘటనలో ఇంటి గోడలు పక్కనున్న ఇళ్ల వరకు ఎగిరి పడటంతో స్థానికులు ఆందోళనకు గురై ఏం జరిగిందో అర్థం కాక అయోమయానికి గురయ్యారు. సంఘటనను చూసేందుకు వచ్చేలోపే వెంకటసుబ్బమ్మ, దినేష్ మృతి వార్త తెలుసుకుని విషాదంలో మునిగారు. మృతుల కుటుంబీకులు, బంధువుల రోదనలు చూసి పలువురు కంటతడిపెట్టారు.

అన్నా.. నాకేంటి?

- మట్టి దందాలో తమ్ముడు తిరకాసు
- కోటకొండ చెరువుపై అధికార పార్టీ నేత కన్ను
- అక్రమంగా మట్టి తవ్వి ఇటుక బట్టీలకు విక్రయం
- వారానికి రూ. కోటిపైనే సంపాదన
- ఈ దందాలో తమను పట్టించుకోవడం లేదని స్థానిక నాయకుడి ఆవేదన
- మట్టి తరలించకుండా దారికి నీళ్లు వదిలిన వైనం



చెరువులో వాహనాలు తిరగకుండా దారికి నీళ్లు వదిలిన దృశ్యం



మట్టి తవ్వకం జరిపిన చెరువు



చెరువులోకి వెళ్లలేక గట్టుపై ఆగిన ప్రొక్లైన్

ఆళ్లగడ్డ: అధికారం వచ్చిందే తడువుగా కూటమి నేతలు అక్రమార్జన కోసం అర్రులు చాస్తున్నారు. ఇసుక, మట్టి, గ్రావెల్ ఇలా ఏదైనా సరే ! అక్రమంగా అమ్ముకానికి పెట్టి సొమ్ము చేసుకునేందుకు తాపత్రయ పడుతున్నారు. ఈ దోపిడీకి టీడీపీలోని కార్యకర్తలు సైతం పోటీ పడుతున్నారు. తాజాగా కోటకొండ చెరువు మట్టి దందాలో అధికారపార్టీ నేతకు స్థానికంగా ఉన్న తెలుగు తమ్ముడి నుంచే అభ్యంతరం ఎదురవ్వడం చర్చనీయాంశంగా మారింది. ఇటుకల తయారీకి నంద్యాల జిల్లా పెట్టింది పేరు. దీన్ని మట్టి మాఫియా ఆదాయంగా మార్చుకుంది. ఇటుకల బట్టీలకు మట్టిని తరలిస్తే రూ. కోట్లు వస్తాయి. దీనిపై కన్నేసిన నియోజకవర్గ పెద్ద తమ్ముడు రాత్రికి రాత్రి ప్రొక్లెయిన్ తెప్పించి కోటకొండ కల్యాని చెరువులో దించారు. ప్రభుత్వానికి రూపాయి రాయల్టీ చెల్లించకుండా రోజు లక్షలు జేబులు నింపుకుంటున్నారు. ఇటుకల బట్టీల నిర్వాహకులు ఒక ట్రిప్పర్ చెరువు మట్టికి రూ. 20 నుంచి 25 వేలు ధర చెల్లిస్తున్నారు. ఒక రాత్రికి కనీసం 100 ట్రిప్పుల మట్టి ఇటుక బట్టీలకు చేరుతోంది. ఈ లెక్కన వారానికి కనీసం రూ. కోటిపైనే వస్తుందని సమాచారం. ఇలా ఏడాది పొడువునా దందా కొనసాగిస్తే ఎన్ని కోట్లు వస్తాయో అంచనా వేయలేక పోతున్నారు. దీంతోనే ఆ నేత ఈ దందాను తమ్ముళ్లకు అప్పగించకుండా తనే సొంతంగా కొనసాగిస్తూ పర్యవేక్షణ మరో వ్యక్తికి అప్పగించాడు. అయితే, ఇది స్థానిక ఆ పార్టీ నాయకులకు రుచించడం లేదు.

కొలిక్కి రాని పంచాయితీ..తిరగబడ్డ తమ్ముడు

మొదటి నుంచి పార్టీకి, భూమా వర్గానికి అండగా ఉంటూ కేసులు సైతం ఎదుర్కొన్న తనను కాదని గ్రామానికి చెందిన మరో వ్యక్తికి చెరువు మట్టి తరలింపు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించడంతో గ్రామానికి చెందిన తెలుగు తమ్ముడు అసహనం వ్యక్తం చేశాడు. ఆ బాధ్యత తనకే అప్పగించేలా పెద్ద తమ్ముడికి చెప్పాలని ఇతర నాయకుల వద్ద ఆవేదన చెందినా వారెవ్వరు ఆ సాహసం చేయలేదు. దీంతో అసహనానికి గురైన కోటకొండ గ్రామ తెలుగు తమ్ముడు తనకు వాటా ఇవ్వకుండా మట్టిని ఎలా తరలిస్తారో చూస్తానని హుకుం జారీ చేశాడు. ఈ విషయం తెలిసిన సదరు నేత అతడిని ఎత్తుకు రావాలని మనుషులను పంపించాడు. వారికి కనిపించకుండా సుమారు నెల రోజులు రహస్య ప్రదేశంలో దాక్కున తెలుగు తమ్ముడు ఇటీవల గ్రామానికి చేరుకున్నాడు. సదరు నేత మట్టిని ఎలా తరలిస్తాడో చూస్తానని చెరువులోకి వెళ్లే దారికి నీళ్లు వదిలాడు. దీంతో మట్టి తరలించేందుకు వచ్చిన వాహనాలు తెలుగుగంగ కట్టపైనే ఆగిపోవడం చర్చనీయాంశంగా మారింది.

ఆత్మహత్య చేసుకోవడానికైనా సిద్ధం

దశాబ్దాలుగా భూమా వర్గానికి అండగా ఉన్నా.. ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నా తనను కాదని ఇప్పుడు వేరే వ్యక్తికి మట్టి తోలకం పనులు అప్పగించి తనను దూరంగా పెడితే సహించేది లేదని అవసరమైతే టీడీపీ జెండా పట్టుకుని చెరువు దగ్గర కట్టపై ఆత్మహత్య చేసుకునేందుకైనా సిద్ధంగా ఉన్నానని సహచర మండల టీడీపీ నాయకుల వద్ద కోటకొండ గ్రామ నాయకుడు ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఏది ఏమైనా గ్రామ తమ్ముడి ఆధిపత్యం చెలాయిస్తుందా ? లేక నేత పలుకుబడి నెగ్గుతుందా ? అన్నది వేచి చూడాల్సిందే!

క్లుప్తంగా

యాగంటి ఆలయ చైర్మన్ రాజీనామా


తోట బుచ్చిరెడ్డి

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటిలో ఉన్న ఉమా మహేశ్వరస్వామి ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి మంగళవారం తన పదవీకి రాజీనామా చేశారు. ఈయన 2023 ఆగస్టు 25 నుంచి చైర్మన్‌గా కొనసాగుతున్నారు. అయితే పదవీ కాలనీకి ఇంకా ఏడు నెలల సమయం ఉన్నా స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నట్లు ఆలయ ఈఓ చంద్రుడుకు ఇచ్చిన రాజీనామా పత్రంలో బుచ్చిరెడ్డి పేర్కొన్నారు.

వీడని చిరుత భయం

మహానంది: మహానంది వాసులతోపాటు సమీప గ్రామమైన ఎంసీ ఫారం ప్రజలను చిరుత భయం వీడటం లేదు. తాజాగా శుక్రవారం ఉపాధి పనులకు వెళ్లిన కూలీలకు చిరుత పాద ముద్రలు కనిపించడంతో భయంతో వెనుతిరిగి వచ్చారు. మహానంది గ్రామానికి చెందిన కొంత మంది ఉపాధి కూలీలు దేవస్థానం అన్నప్రసాద భవనం వెనుక కాలువ పనులకు వెళ్లారు. సమీపంలో చిరుత పాదముద్రలు కనిపించడంతో భయంతో ఇంటికి వచ్చారు.

బీటెక్ విద్యార్థి బలవన్మరణం


శివప్రసాద్(ఫైల్)

డోన్ రూరల్: మండల పరిధిలోని గుమ్మకొండ గ్రామానికి చెందిన శీను, లక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు బీటెక్ చదువుతున్న శివప్రసాద్(19) మంగళవారం ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. శివప్రసాద్ తిరుపతి సమీపంలోని ఎస్‌వీసీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. పక్కనే ఉన్న పీజీ హాస్టల్‌లో ఉంటూ కళాశాలకు రాకపోకలు సాగించేవాడు. కాగా ఏం జరిగిందో ఏమో కానీ గదిలో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వివాహిత ఆత్మహత్య

డోన్ టౌన్: పట్టణంలోని కొత్తపేటలోని స్వీపర్స్ కాలనీలో నివాసం ఉంటున్న సుమలత(29) మంగళవారం సాయంత్రం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త నాగమనోహర్ వృత్తిరీత్యా కారు డ్రైవర్ కావడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లినట్లు తెలిసింది. కుటుంబంలోని మనస్పర్థల కారణంగా ఆమె ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మృతురాలి తల్లి నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బనవాసి కేవీకేలో యువతకు ఉచిత శిక్షణ

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో గ్రామీణ యువతీ యువకులకు వ్యవసాయ, అనుబంధ రంగాల్లో నైపుణ్యంపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ రాఘవేంద్రచౌదరి తెలిపారు.

అమ్మ కడుపులో రాచపుండు

- గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తో ఇబ్బందులు
- క్యాన్సర్ బాధితుల్లో 20 శాతం మందికి ఇదే సమస్య
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 60 వేల మంది బాధితులు
- జనవరి గర్భాశయ ముఖ ద్వార అవగాహన మాసం

మనిషి పుట్టుకకు ప్రధాన అవయవమైన గర్భాశయమే పుండుగా మారుతోంది. ఎలాంటి లక్షణాలు కనిపించకుండా లోలోపలే ఇబ్బంది పెడుతోంది. అనంతరం క్యాన్సర్‌గా మారి అమ్మనే కబలిస్తోంది. ప్రాథమిక దశలో దీనిని గుర్తిస్తే ప్రాణాలతో బయట పడవచ్చు. వ్యాధి ముదిరిపోయిన తర్వాత గుర్తిస్తే మాత్రం ప్రాణాలపై ఆశ వదులుకోవాల్సిందే. ఈ వ్యాధిపై అవగాహన లేక చాలా మంది మహిళలు తమలోపల క్యాన్సర్ ఉందన్న విషయాన్ని గుర్తించలేకపోతున్నారు. ఈ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏటా జనవరి మాసాన్ని గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ అవగాహన మాసంగా నిర్వహించాలని ఆదేశించింది.

– కర్నూలు(హాస్పిటల్)

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను వైద్యపరిభాషలో సెర్వికల్ క్యాన్సర్ అంటారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా మహిళల్లో నాల్గవ అత్యంత సాధారణ క్యాన్సర్‌గా, మన దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇది రెండవ అత్యంత సాధారణ క్యాన్సర్‌గా వైద్యులు పేర్కొంటున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉండే క్యాన్సర్ వైద్యుల వద్దకు ప్రతిరోజూ 120 నుంచి 150 మంది వరకు కొత్తగా క్యాన్సర్ బాధితులు చికిత్స కోసం వస్తున్నారు. కర్నూలులో ఒక ప్రభుత్వ, రెండు ప్రైవేటు క్యాన్సర్ ఆసుపత్రులు ఉన్నాయి. ఆయా క్యాన్సర్ ఆసుపత్రుల్లో ప్రతిరోజూ 20 నుంచి 30 మందికి కీమోథెరపీ, 40 మందికి రేడియోథెరపీ చేస్తున్నారు. ఈ ఆసుపత్రుల్లో నిత్యం 150 నుంచి 200 మంది ఇన్‌పేషంట్లు చికిత్స తీసుకుంటున్నారు. ఇందులో 20 శాతం మంది గర్భాశయ ముఖద్వార క్యాన్సర్(సెర్వికల్ క్యాన్సర్) బాధితులు ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ వ్యాధితో బాధపడుతున్న వారి సంఖ్య 60 వేలకు పైగా ఉంటుందని వైద్యుల అంచనా. పేదరోగులకు అన్ని రకాల క్యాన్సర్ వ్యాధులకు డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్యసేవ(ఆరోగ్యశ్రీ)లో ఉచితంగా వైద్యం అందుతోంది.


గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను తెలిపే చిత్రం

వ్యాధి లక్షణాలు
- రుతుక్రమంలో సమస్యలు.. యోని నుంచి రక్తస్రావం
- లైంగిక సంపర్కం తర్వాత రక్తస్రావం
- పీరియడ్స్ ఆగిపోయిన తర్వాత రక్తస్రావం (మెనోపాజ్)
- యోని నుంచి దుర్వాసన, రక్తంతో కూడిన గడ్డలు రావడం
- మూత్రం, మల విసర్జనలో ఆటంకాలు

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు కారణాలు

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ప్రధానంగా హ్యూమన్ పాపిల్లోమా వైరస్(హెచ్‌పీవీ) కారణంగా వస్తుంది. ఇదే గాక తక్కువ వయస్సులో వివాహం చేయడం, లైంగిక సంబంధాలు కొనసాగించడం, స్త్రీ, పురుషులిద్దరిలో బహుళ లైంగిక భాగస్వాములుగా ఉండటం, ముందస్తు ప్రసవాలు, ఎక్కువ మంది పిల్లలను కనడం, ధూమపానం, మద్యపానం అలవాట్లు ఈ క్యాన్సర్ రావడానికి కారణాలు. ఈ క్యాన్సర్ 40 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు వారిలో ఎక్కువగా వస్తోంది.

నివారణ చర్యలు

ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆదేశాల ప్రకారం 2030 నాటికి 90 శాతం కౌమార బాలికలకు 15 ఏళ్ల వయస్సులోపు హెచ్‌పీవీ వైరస్‌కు వ్యతిరేకంగా టీకాలు వేయాలి. 70 శాతం మహిళలు 35 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారికి కచ్చితంగా స్క్రీనింగ్ పరీక్షలు చేయాలి. గర్భాశయ పూర్వ క్యాన్సర్ లేదా క్యాన్సర్‌తో బాధపడుతున్న 90 శాతం మహిళలకు తగిన చికిత్స అందించాలి. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జనవరి మాసాన్ని సర్వికల్ క్యాన్సర్ అవగాహన మాసంగా విస్తృత ప్రచారం నిర్వహించాలి.

హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించుకోవాలి



వివాహమైన మహిళలు ఏటా గర్భాశయ ముఖద్వారంలో పాప్‌స్మియర్ టెస్ట్ చేయించుకోవాలి. ఈ మేరకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే దీనిని పూర్తిగా నయం చేసుకోవచ్చు. దీనికి తోడు కౌమారదశ బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయడం వల్ల వారికి 70 నుంచి 80 శాతం వరకు ఈ క్యాన్సర్ రాకుండా నివారించవచ్చు. సాధారణంగా మహిళలకు హెచ్‌పీవీ వైరస్ సోకిన 10 నుంచి 15 ఏళ్ల తర్వాత క్యాన్సర్‌గా మారుతుంది.

– డాక్టర్ టి.జ్యోత్స్న, గైనకాలజిస్టు, కర్నూలు

ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా పరీక్షలు



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గైనకాలజీ విభాగానికి గైనిక్ సమస్యలతో వచ్చే ప్రతి వంద మంది మహిళల్లో ఇద్దరు, ముగ్గురికి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ఉంటోంది. ఓపీకి వచ్చే వారికి పాప్‌స్మియర్ పరీక్షను చేస్తున్నాం. ఇందులో అసాధారణంగా కనిపించే వారికి కాల్పోస్కోపి టెస్ట్ ద్వారా బయాప్సీ తీసి పంపిస్తున్నాం. అందులో క్యాన్సర్‌గా నిర్ధారణ అయితే స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఉచితంగా చికిత్స అందిస్తున్నారు. 30 ఏళ్లు దాటిన ప్రతి మహిళా లక్షణాలు ఉన్నా లేకపోయినా పాప్‌స్మియర్ పరీక్ష చేయించుకోవాలి. దీనివల్ల క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించి వారికి చికిత్స ఇచ్చేందుకు అవకాశం ఏర్పడుతుంది.

– డాక్టర్ పి.స్నేహ, అసిస్టెంట్ ప్రొఫెసర్, గైనకాలజీ విభాగం, జీజీహెచ్, కర్నూలు

ఎస్‌ఆర్ కళాశాలలో క్షుద్ర పూజ కలకలంపై విచారణ


కాలేజీలో విద్యార్థినులను విచారిస్తున్న ఆర్‌ఐఓ గురవయ్య శెట్టి

కర్నూలు సిటీ: నగర శివారులోని ఎస్‌ఆర్ జూనియర్ కాలేజీలో కలకలం రేపిన క్షుద్ర పూజ ఘటనపై అధికారులు విచారణ చేపట్టారు. ఇంటర్ బోర్డు కమిషనర్ కృతికా శుక్లా ఆదేశాల మేరకు మంగళవారం ప్రాంతీయ కార్యాలయ అధికారి జీవీఎస్ గురువయ్య శెట్టి.. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు, తాలూకా పోలీసులు కలిసి ఎస్‌ఆర్ కాలేజీకి చేరుకుని విచారించారు. ఫస్ట్ ఇయర్ బైపీసీ విద్యార్థినులు, హాస్టల్ విద్యార్థినులతో మాట్లాడి వివరాలు సేకరించారు. తాము నిద్రలో ఉండగా గట్టిగా కేకలు వేయడంతో మేల్కొని చూడగా బాధిత విద్యార్థిని జుట్టు కత్తిరించి ఉందని, ఇంత కంటే తమకేమీ తెలియదని విద్యార్థినులు చెప్పినట్లు సమాచారం. కాగా విద్యార్థినుల భద్రతను గాలికొదిలిన యాజమాన్యంపై చర్యలు తీసుకుని, కాలేజీ గుర్తింపును రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు. కాసేపటికే ఆర్‌ఐఓ వెళ్లిపోతుండగా పూర్తి స్థాయిలో విచారణ చేయకుండా ఎలా వెళ్తారంటూ వాహనాన్ని అడ్డుకోగా ఆయన తన వాహనాన్ని అక్కడే వదిలేసి ఆటోలో వెళ్లిపోయారు. కాగా విచారణ విషయమై ఆర్‌ఐఓను వివరణ కోరగా నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

ఇంటర్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయండి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): ఇంటర్ ప్రాక్టికల్, పబ్లిక్ పరీక్షలకు పకబ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఫిబ్రవరి 10 నుంచి 20వ తేదీ వరకు ప్రాక్టికల్స్, మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరాల పబ్లిక్ పరీక్షలు జరిగేలా షెడ్యూల్ ఇచ్చిన నేపథ్యంలో ఇప్పటి నుంచే ఏర్పాట్లపై దృష్టి సారించాలని సూచిచారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఇంటర్ ప్రాక్టికల్స్, ప్రధాన పరీక్షల నిర్వహణపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాక్టికల్స్ కోసం 91 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని, అందులో 15,194 మంది విద్యార్థులు పరీక్ష రాసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధాన పరీక్షల కోసం 69 సెంటర్లను ఏర్పాటు చేయాలని, ఇందులో మొదటి సంవత్సరం నుంచి 45,325 మంది, రెండో సంవత్సరం నుంచి 22,227 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు చెప్పారు. ఆయా విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా సరైన వెలుతురు, గాలి వచ్చేలా చూడాలని, కరెంట్,ఫ్యాన్‌లు, టేబుళ్లు ఉండేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రశ్న పత్రాల భద్రతకు ఆర్మ్‌డ్‌గార్డులతోపాటు పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, సూపర్‌వైజర్లు, ఇన్విజిలేటర్ల నియామకంపై దృష్టి సారించాలని డీవీఈఓకు సూచించారు. ప్రశ్న పత్రాలను తీసుకెళ్లేపాయింట్ నుంచి కేంద్రాల వరకు ప్రశ్న పత్రాలను పోలీసు బందో బస్తు మధ్య తీసుకెళ్లేలాచర్యలు తీసుకోవాలన్నారు. అన్ని పరీక్షల కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూయించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులను ఏర్పాటుచేయాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. 8 పరీక్షా కేంద్రాలకు బస్సులు నడిపే అవసరం ఉందని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆర్‌టీసీ ఆర్‌ఎం శ్రీనివాసులును ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఆర్వోబీకే వెంకటేశ్వర్లు, మునిసిపల్ కమిషనర్ రవీంద్రబాబు, డీఎస్పీ బాబు ప్రసాదు, ఆర్‌ఐఓ గురయవ్య, డీవీఈఓ పరమేశ్వర రెడ్డి, పరీక్షల స్పెషలాఫీసర్ లాలెప్ప పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల-లింగాల ఆర్ అండ్‌బీ రహదారిలో పట్టణ శివారులోని జుర్రేరు సమీపంలో మంగళవారం ఉదయం ఓ యువకుడి మృతదేహం లభ్యమైంది. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. స్వామినగర్ కాలనీకి చెందిన నల్లగట్ల చిన్నదస్తగిరి అలియాస్ పుల్లయ్య(32)కు 13 ఏళ్ల క్రితం ఎల్‌ఎం కాంపౌండ్‌కు చెందిన ఆదిలక్ష్మితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పుల్లయ్య ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చి ఏడాది నుంచి విడిగా ఉంటున్నారు. మద్యానికి బానిసైన పుల్లయ్య అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతదేహం పక్కనే మృతుడి బైక్, మద్యం బాటిల్, వాటర్‌ప్యాకెట్లు, గ్లాస్ పడి ఉన్నాయి. అతిగా మద్యం తాగి ఊపిరాడక మృతి చెందాడా, ఆత్మహత్యకు పాల్పడ్డాడా, ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణాల్లో పోలీసులు వివరాలు ఆరా తీస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.


చిన్న దస్తగిరి మృతదేహం

ఎన్‌జీఓ అసోసియేషన్‌లో లుకలుకలు

- స్పందించని నాయకత్వం

కర్నూలు(అగ్రికల్చర్): ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖలో లుకలుకలు చోటుచేసుకుంటున్నాయి. జిల్లా ట్రెజరీ సీనియర్ అకౌంటెంట్ వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి రెండు దశాబ్దాలకుపైగా ఎన్‌జీఓ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. జనరల్ సెక్రటరీగా పశుసంవర్ధక శాఖలో ఆరేళ్లుగా విధులు నిర్వహిస్తున్న జవహర్‌లాల్ కొనసాగుతున్నారు. కాగా వెంగళ్‌రెడ్డి మరో ఆరేడు నెలల్లో పదవీ విరమణ చేయనుండటంతో తనకు అనుకూలమైన వారికి ఆ పదవిని కట్టబెట్టేందుకు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు అసోసియేషన్ జవహర్‌లాల్ గెజిటెడ్ అధికారిగా పదోన్నతి పొందినప్పటికీ జిల్లా సెక్రటరీగా కొనసాగుతూ, అన్ని కార్యక్రమాలకు హాజరవుతున్నారు. ఈక్రమంలో ఉన్నట్టుండి ఈనెల 1న నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపే ఫ్లెక్సీలో శ్రీశైలం ప్రాజెక్టు ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ సీనియర్ అసిస్టెంట్ కేసీహెచ్ కృష్ణుడు జిల్లా ఎన్‌జీఓ అసోసియేషన్ ఇన్‌చార్జ్ సెక్రటరీగా వేసుకోవడం చర్చనీయాంశమైంది. జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి సూచనల మేరకే కృష్ణుడు తన పేరును వేసుకున్నట్లు తెలుస్తోంది. ఇదే నెల మొదటి వారంలో విజయవాడలో జరిగిన అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎన్నిక కార్యక్రమంలోనూ రాష్ట్రస్థాయి నాయకుల సమక్షంలో జిల్లాకు చెందిన ఇద్దరు నేతల మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరిగినట్లు సమాచారం. దీనికి తోడు జనవరి 1న వేసిన ఫ్లెక్సీలో ఇన్‌చార్జ్ సెక్రటరీగా వేసుకున్న కేసీహెచ్ కృష్ణుడు తాజాగా రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలిపే ఫ్లెక్సీలో జిల్లా సెక్రటరీగా పేరు వేసుకున్నారు. తాజా ఫ్లెక్సీ విషయమై సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోనే ఆర్‌అండ్‌బీ ఉద్యోగుల సంఘం నేతకు, జిల్లా సెక్రటరీగా ఫ్లెక్సీలో పేరు వేయించుకున్న కృష్ణుడు ఒకరిపైఒకరు చెప్పులు విసురుకున్నట్లు తెలుస్తోంది. ఎన్‌జీఓ అసోసియేషన్‌లో వరుసగా జరుగుతున్న ఘటనలపై జిల్లా అధ్యక్షుడు కానీ, రాష్ట్ర నాయకత్వం కానీ స్పందించిన దాఖలాలు లేవు. కాగా ఎన్‌జీఓ అసోసియేషన్‌లో తాను జనరల్ సెక్రటరీగా కొనసాగుతున్నానని పశుసంవర్ధక శాఖ గెజిటెడ్ మేనేజర్ జవహర్‌లాల్ ప్రకటించారు.

బొలెరో వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం

- తెలంగాణలో ఘటన

నందవరం: బొలెరో వాహనం ఢీకొని మాచాపురం గ్రామానికి చెందిన మంగలి హనుమంతు(35) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మంగలి హనుమంతు భార్య రుక్మిణి ఇటీవల పుట్టినిల్లు తెలంగాణ రాష్ట్రం గద్వాల జోగులాంబ జిల్లా తన గల గ్రామానికి వెళ్లింది. ఆమెతో కలిసి బైక్‌పై హనుమంతు మంగళవారం స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గ మధ్యలో అయిజ మున్సిపాలిటీ పరిధిలోని పర్దిపురం గ్రామ సమీపంలో ఎదు రుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. ప్రమా దంలో హనుమంతు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. రుక్మిణికి స్వల్ప గాయాలయ్యాయి. కాగా కళ్లెదుటే భర్త మృతి చెందడంతో రుక్మిణి రోదనలు స్థానికులను కంటతడిపెట్టించాయి. మృతుదేహాన్ని గద్వాల జోగులాంబ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతిడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.


మృతి చెందిన మంగలి హనుమంతు

కారు డివైడర్‌ను ఢీకొని మహిళ..

ప్యాపిలి: మండల పరిధిలోని పోతుదొడ్డి వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీలత (38) దుర్మరణం చెందింది. అనంతపురం జిల్లా కదిరి పట్టణానికి చెందిన కార్తీక్, శ్రీలత దంపతులు తమ రెండేళ్ల చిన్నారితో కలిసి కారులో వ్యక్తిగత పని నిమిత్తం హైదరాబాదుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వారు కదిరికి వెళ్తుండగా పోతుదొడ్డి వద్దకు రాగానే అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. ప్రమాదంలో శ్రీలతకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. భర్త కార్తీక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. రెండేళ్ల చిన్నారి సురక్షితంగా బయటపడింది. ప్యాపిలి ఎస్‌ఐ మధు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

భక్తుల పట్ల మద్యంబాబుల వికృత చేష్టలు

- సెల్‌ఫోన్లలో మహిళల ఫొటోలు చిత్రీకరణ

మహానంది: మద్యం తాగి మహానంది ఆలయంలోనికి ప్రవేశించడమే గాకుండా కోనేరులో స్నానం చేస్తున్న మహిళల ఫొటోలు తీసిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. హైదరాబాద్ ఈసీఐఎల్ ప్రాంతానికి చెందిన విజయ్, వారి కుటుంబ సభ్యులు స్థానిక రుద్రగుండం(పెద్దకోనేరు)లో స్నానం చేస్తుండగా కర్ణాటక రాష్ట్రానికి చెందిన కొందరు వ్యక్తులు మద్యం మత్తులో మహిళల ఫొటోలను తీశారు. గమనించిన భక్తులు వారిని మందలించగా తిరగబడ్డారు. చివరికి వారు సెల్‌ఫోన్ లాక్కుని పోలీసులకు అప్పగించారు. కాగా పోలీసులు తమపై చర్యలు తీసుకుంటారనే భయంతో కర్ణాటక వాసు లు సెల్‌ఫోన్ వదిలేసి కారులో ఉడాయించారు.

శ్మశాన వాటిక కోసం ముస్లింల నిరసన

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు, క్రిష్ణారావు పేట ముస్లిం, దూదేకుల మైనార్టీలు శ్మశాన వాటిక సమస్యపై మంగళవారం టెంట్ వేసి నిరసన వ్యక్తం చేశారు. అటుగా వెళ్తున్న ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ అహ్మద్, ప్రభుత్వ సలహాదారు షరీఫ్‌లను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ముస్లింలు మాట్లాడుతూ జూపాడుబంగ్లా మండలం బన్నూరు గ్రామ సరిహద్దులో 40 సెంట్ల స్థలంలో శ్మశాన వాటిక ఉందన్నారు. నేషనల్ హైవే 340సీ నిర్మాణంలో భాగంగా 20 సెంట్ల స్థలం పోతోందని, మిగిలిన 20 సెంట్లలో రెండు గ్రామాలలోని 400 ముస్లిం, దూదేకుల మైనార్టీ కుటుంబాలకు శ్మశాన వాటిక సరిపోదన్నారు. ప్రత్యామ్నాయంగా స్థలం చూపించాలని కోరారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌ను కలవాలని చైర్మన్, ప్రభుత్వ సలహాదారు సూచించి వెళ్లిపోయారు. సమస్య పరిష్కరించే వరకు నిరసన కొనసాగిస్తామని ముస్లిం, దూదేకుల మైనార్టీలు పేర్కొన్నారు.


టెంట్‌లో కూర్చుని నిరసన తెలుపుతున్న మైనార్టీలు

ఇద్దరు మహిళలకు రిమాండ్

డోన్ టౌన్: వ్యభిచారం కేసులో పట్టుబడిన మహిళతోపాటు నిర్వాహకురాలిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా తెలిపారు. స్థానిక కొత్తపేటలోని ఒక ఇంటిలో అనసూయమ్మ గుట్టు చప్పుడు కాకుండా ఇతర మహిళలతో వ్యభిచారం చేయిస్తున్నట్లు సమాచారం అందడంతో మంగళవారం సోదాలు నిర్వహించగా పత్తికొండ ప్రాంతానికి చెందిన మహిళను గుర్తించి ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. నిర్వాహకురాలు అనసూయమ్మపై గతంలో కూడా రెండు కేసులు ఉన్నాయన్నారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు.

అట్టహాసంగా స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

- హాజరుకానున్న 13 జిల్లాల క్రీడాకారులు
- అథ్లెటిక్స్‌తోపాటు ఆరు క్రీడాంశాల్లో పోటీలు

విశాఖ స్పోర్ట్స్ : కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహిస్తున్న 27వ ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన 720 మంది బాలురు, 510 మంది బాలికలు అథ్లెటిక్స్‌తో పాటు ఆరు క్రీడాంశాల్లో పోటీపడనున్నారు. వాలీబాల్, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, బ్యాడ్మింటన్, టీటీ, చదరంగంతో పాటు అథ్లెటిక్స్ ట్రాక్, ఫీల్డ్ అంశాల్లోనూ మూడు రోజుల పాటు జరిగే ఈపోటీలో 138 ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్స్‌కు చెందిన విద్యార్థులు ప్రాంతీయ జట్లుగా తలపడనున్నారు. ఆయా జట్ల సభ్యుల నుంచి అతిథులు గౌరవవందనాన్ని స్వీకరించారు. డిఫెండింగ్ చాంప్ కృష్ణా జట్టు నుంచి ఆతిథ్య జట్టు విశాఖతో సహా 13 రీజియన్ జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. కృష్ణా జట్టుకు జయకుమార్, అనంతపురానికి మహేష్, చిత్తూర్‌కు గిరిబాబు, తూర్పుగోదావరికి చిరంజీవి, గుంటూరుకు దేముడు, కడపకు హేమంత్‌రెడ్డి, కర్నూలుకు త్రిమూర్తి, నెల్లూరుకు తరుణి, ప్రకాశంకు నిఖిల్, శ్రీకాకుళానికి శివరామకృష్ణ, విజయనగరానికి లక్ష్మి, పశ్చిమగోదావరి జట్టుకు అవినాష్, విశాఖ జట్టుకు హేమంత్ కంటింజెంట్ లీడర్‌గా వ్యవహరించారు. క్రీడా జ్యోతి వెలిగించిన అనంతరం ఆయా జట్ల కెప్టెన్లు ప్రతిజ్ఞ చేశారు. అతిథులు శాంతికపోతాలను గాల్లోకి విడవగా ముఖ్యఅతిథి మీట్ ప్రారంభాన్ని ప్రకటించారు. గేమ్స్ బాలుర విభాగంలో అప్పర్‌పూల్‌లోని అనంతపురం రీజియన్‌తో కర్నూలు రీజియన్ జట్ల మధ్య వాలీబాల్ పోటీని...అథ్లెటిక్స్ ట్రాక్ ఈవెంట్‌లో భాగంగా బాలబాలికలకు 800 మీటర్ల పరుగును ప్రారంభించారు. అథ్లెటిక్స్‌లో బాలబాలికలకు స్ప్రింట్ అంశాలతో పాటు 800 మీటర్ల పరుగు, జంప్స్, త్రోస్ నిర్వహించనుండగా బాలురకు 1,500 మీటర్ల పరుగు, వంద, 400 మీటర్ల రిలే పరుగును నిర్వహించనున్నారు. క్రీడాపోటీలను పోటీలను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. భారత్ శక్తి యువతేనని, సాంకేతికతను అందిపుచ్చుకుని మరింత ముందుకు సాగాలని సూచించారు.


శాంతికపోతాలను గాల్లో విడిచి మీట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ పి.రఘువర్మ, తదితరులు


ఉత్సాహంగా సాగుతున్న బాలికల 800 మీటర్ల పరుగు